telugurekhamedia.com

TELUGU REKHA TELUGU DAILY

# తెలుగు రేఖ

సంపుటి : 02 సంచిక : 11 పేజీలు : 4 వెల : రూ. 2.00

తెలుగు దినపత్రిక

ఆదివారం 29 మార్చి 2026 తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ RNI No.TELTEL/2010/31853

## వైభవంగా శ్రీసీతరామ పట్టాభిషేకం

*- వేడుకలో పాల్గొన్న గవర్నర్ శుక్లా*



**భద్రాచలం,మార్చి 28 తెలుగురేఖ:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. వేలాది మంది భక్తుల సమక్షంలో జయ జయ నీరాజనాల మధ్య దేవదేవుడికి అర్చకులు సమస్త నదీ జలాలతో అభిషేకం చేశారు. ఈ పుణ్య జలాన్ని భక్తులపై చిలకరించి సమస్త లోకాలు శుభాలతో వర్ధిల్లాలని ఆశీస్సులు పలికారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు.

## ప్రభుత్వ ఆధీనంలోకి

# హైదరాబాద్ మెట్రో

### అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం



- మెట్రో విస్తరణకు మార్గం సుగమం
- తీర్మానం ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్
- మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణ
- రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా అన్నింటిపైనా దర్యాప్తు
- అక్రమాలను సహించేది లేదని వెల్లడి
- ప్రభుత్వ ఖజానాకు గండికొడితే ఊరుకోం
- అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన

**హైదరాబాద్,మార్చి28 తెలుగురేఖ:** హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది. నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని పక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని 2 లో..



## అందుబాటులోకి

# మరో అంతర్జాతీయ విమానాశ్రయం

- నెయిడా జేవర్‌లో దేశంలోనే అతిపెద్ద విమనాశ్రాయం
- ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ
- నోయిడా మూఢనమ్మకాన్ని చెరిపేసామని వ్యాఖ్య
- పశ్చిమాసియా యుద్ధ ప్రభావం పడకుండా చర్యలు



**న్యూఢిల్లీ,మార్చి 28 తెలుగురేఖ:** మరో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది. జెవర్‌లో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈసందర్భంగా మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు రాజకీయ నేతలు వదిలేసిన ఈ ప్రాంతమే.. ఇప్పుడు ప్రపంచస్థాయి నేతలను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉంది. నేడు దేశానికి గర్వకారణంగా నిలిచిందని మోదీ పేర్కొన్నారు. విపక్ష సమాజ్‌వాదీ పార్టీపై విమర్శలు చేశారు. ఆ పార్టీ నేతలు తమ మూఢనమ్మకాలు, పిరికితనంతో 2 లో..

## చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

- పథకాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి
- అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ
- అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు అందచేత



**హైదరాబాద్,మార్చి 28 తెలుగురేఖ:** దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు 2 లో..

## ఏప్రిల్ 6 వ తేదీ లోపు అప్లై చేసుకోండి

## జర్నలిస్టులకు అక్రెడిటేషన్ గడువు

- ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక

**హైదరాబాద్, మార్చి 28 తెలుగురేఖ:** తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డుల కోసం ఏప్రిల్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక సూచించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆమె పలు 2 లో..



## నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుతో

# సీఎంలో డిప్రెషన్ మొదలైంది

- ప్రధానిపై దిగజారి మాట్లాడుతున్నారు
- దక్షిణాది, ఉత్తరాది అంటూ ప్రాంతీయ విద్వేషాలు రగిలించాలనుకుంటున్నారు
- 6 గ్యారంటీలపై ద్రుష్టి మళ్లించేందుకు అనేక డ్రామాలాడుతున్నారు
- కాళేశ్వరం డిజైన్ లోపం బాధ్యత కేసీఆర్ దే
- కేసీఆర్ తో సీఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కు
- అందుకే కేసీఆర్ కుటుంబం సహా బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడం లేదు
- కవిత పార్టీని స్వాగతిస్తున్నాం...



- ప్రజల కోసం, పేదల కోసం పనిచేస్తేనే ఏ పార్టీకైనా గుర్తింపు
- సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్...

**కరీంనగర్ తెలుగురేఖ మార్చి 28:** నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్లను కేంద్రం అమలు చేసేందుకు సిద్ధమవ్వడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో డిప్రెషన్ మొదలైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అందుకే 2 లో..



## మూసీని అడ్డుకుంటే


# శివతాండవమే

- ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు
- మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
- దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సిఎం రేవంత్

**రంగారెడ్డి,మార్చి28 తెలుగురేఖ:** రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. 2 లో..

## ఇక అమరావతి ప్రజారాజధాని

- విభజన సమయంలో బస్సులోనుంచి పాలన,
- 9 నెలల కాలంలో సచివాలయం, అసెంబ్లీ నిర్మాణం,
- భూములు ఇచ్చిన రైతులకు శిరసు వంచి నమస్కారం,
- అసెంబ్లీలో సిఎం చంద్రబాబు ఉద్వేగ ప్రసంగం,
- అమరావతి రాజధాని కోసం ఏకగ్రీవ తీర్మానం ఆమోదం



**అమరావతి,మార్చి 28 తెలుగురేఖ:** ప్రజా రాజధాని అమరావతి అని.. తీర్మానం ఆమోదం తర్వాత కేంద్రానికి పంపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఏపీ అసెంబ్లీలో రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానంపై చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇకపై రాజధాని అమరావతికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. శాతవాహనులు 2 లో..

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని..

# అది అమరావతి

- గతంలో మూడు రాజధానుల పేరిట వైసిపి నాటకాలు
- భూములు ఇచ్చిన రైతులను కేసులో హింసించారు
- బలమైన నాయకుడు చంద్రబాబు వల్లనే అభివృద్ధి సాధ్యం
- అందుకే కూటమి కట్టి ఎన్నికల్లో పోటీ చేశాం
- అసెంబ్లీలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

**అమరావతి,మార్చి 28 తెలుగురేఖ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉందని, అది అమరావతి మాత్రమేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. చంద్రబాబులాంటి వ్యక్తి చేతిలో ఏపీ ఉంటేనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాజధాని కోసం రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. 2 లో..



## తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

- గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం
- ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సిఎం






**హైదరాబాద్,మార్చి 28 తెలుగురేఖ:** ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా 3 లో..

## ఏప్రిల్ 6 వ తేదీ లోపు అప్లై చేసుకోండి జర్నలిస్టులకు అక్రెడిటేషన్ గడువు

వివరాలు వెల్లడించారు. జర్నలిస్టులు తమ యాజమాన్యాల నుంచి పొందిన సిఫార్సు లేఖతో పాటు అవసరమైన పేపర్ కటింగులు విద్యార్హతల సర్టిఫికెట్లు ఇండిపెండెంట్ జర్నలిస్టులు కటింగ్లతో పాటు సంబంధిత ఎడిటర్ పత్రికకు వార్తలు రాసినట్లు ధ్రువీకరించే లేఖ సంబంధిత అర్హత పత్రాలను జత చేయడంతో పాటు తాము వేరే ఇతర వృత్తులలో అనగా సొసైటీ చైర్మన్, డైరెక్టర్ ప్రభుత్వ ఉద్యోగం, న్యాయవాద వృత్తి, సర్పంచ్ తదితర ఇతరత్రా ఏ పదవుల్లో కొనసాగడం లేదని సెల్ఫ్ డిక్లరేషన్ జతచేసి హార్డ్ కాపీని సంబంధిత డిపిఆర్ఓ కార్యాలయాలలో అందజేయాలని, అప్లికేషన్‌ను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై సంబంధిత అధికారులకు కఠిన చర్యలకై ఆదేశాలు ఇవ్వనున్నట్లు స్పెషల్ కమిషనర్ వెల్లడించారు ఇప్పటికే రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ రెండు సార్లు సమావేశమై జీఓ అమలు, విధి విధానాలపై చర్చించిందని, అందరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను సమీక్షిస్తూ, అర్హత ప్రమాణాలు పూర్తి చేసిన జర్నలిస్టులకు కార్డులు జారీ చేసే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## మూసీని అడ్డుకుంటే శితాండవమే

మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

## చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద




బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ ఉప్మా, కిచిడీ మిక్స్ ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని సీఎం అన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. అంగన్వాడీ భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని..అది అమరావతి

వైసీపీ పాలనలో అమరావతిపై కక్ష కట్టారని, మూడు రాజధానులంటూ మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ప్రజలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిపై చర్చలో శనివారం పవన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. తెలంగాణ వేరు.. ఏపీ వేరు అనే భావన మాకెప్పుడూ లేదు. తెలుగునేల అనేదొక్కటే మా భావన. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు. రాజధాని లేని రాష్ట్రంగా మనం ఇంకా కొట్టుకుంటూనే ఉన్నాం. ఏపీ నేలపై ప్రేమతోనే ఎలాంటి షరతులు లేకుండా టీడీపీతో కలిశాం. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే కూటమిగా ఏర్పడ్డాం. వైసీపీ హయాంలో ఎక్కడ చూసినా అరాచకమే. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే మహిళలు భయపడేవారు. ప్రశ్నించిన అందరిపైనా దాడులు చేశారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని విభజించేటప్పుడు కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించ లేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి సరైన కార్యాలయాలు లేవని, చంద్రబాబు బలమైన ఆశావాది కాబట్టి.. కార్యాలయాలు లేకపోయినా టెంట్ వేసుకొనైనా పని చేద్దామని ఆశించారన్నారు. రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లయినా.. ఇప్పటికీ రాజధాని కోసం కొట్టుకుంటున్నాం. ఇప్పటికీ రాజధాని, సరైన హైకోర్టు లేదని తలచుకుంటే బాధేస్తోంది. అభివృద్ధికి రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. రాజధాని కోసం మెజార్టీ రైతులు ఇష్టపూర్వకంగానే భూములు ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా 33వేల ఎకరాలు రాజధాని కోసం సేకరించారు. 2019లో ప్రభుత్వం మారాక.. అమరావతిపై కక్ష కట్టారు. అమరావతి రైతులకు మద్దతుగా నేను వెళ్తే.. ముళ్ల కంచెలు వేశారు. వైకాపా హయాంలో శాసనసభ్యులకే రక్షణ లేకపోతే.. రైతులకు ఎలా ఉంటుంది? రాజధాని కోసం భూములిచ్చిన రైతులను వైకాపా హయాంలో హింసించారు. వైకాపా హయాంలో మూడు రాజధానుల ప్రతిపాదన చేశారు. రాజధాని సమస్యను పరిష్కరించకపోగా.. కఠినం చేశారు. వైకాపా మళ్లీ వస్తే.. పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. వైకాపా మళ్లీ రాదు.. వచ్చినా ఏం చేయలేదు. అమరావతి రైతుల కోసం మనమంతా ఒకే మాటపై ఉండాలని అన్నారు. అమరావతిపై జనసేన ఎప్పుడూ మాట మార్చదు..దీనికి కట్టుబడి ఉన్నాం. చట్టసభల్లో కూర్చొని దాడులు చేస్తామంటే.. చూస్తూ ఊరుకోం అన్నారు. రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వం ఉంటేనే.. పెట్టుబడులు వస్తాయి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేటప్పుడు చంద్రబాబును అందరూ విమర్శించారు. ప్రపంచబ్యాంకుతో కుమ్మక్కయ్యారని ఆరోపించేవాళ్లు. రాజకీయ నేత ఎన్నికల గురించి ఆలోచిస్తాడు. దార్శనికుడు ఒక తరం గురించి ఆలోచిస్తాడని పవన్ అన్నారు.

# నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుతో సీఎంలో డిప్రెషన్ మొదలైంది

ప్రధానిపై దిగజారి మాట్లాడుతున్నారని, దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం డిజైన్ లోపానికి ప్రధాన బాధ్యత కేసీఆర్ దేనని చెప్పారు. అయినప్పటికీ కేసీఆర్ ను, కాళేశ్వరం అవినీతి పరులను రేవంత్ రెడ్డి సర్కార్ అరెస్ట్ చేయడం లేదని అన్నారు. కేసీఆర్ తో రేవంత్ రెడ్డి కుమ్మక్కువడంవల్లే కేసీఆర్ కుటుంబంసహా బీఆర్ఎస్ నేతల అవినీతిపై చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. శనివారం రోజున కరీంనగర్ లోని తన నివాసంలో సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసిన కేంద్ర మంత్రి వాటి పనితీరును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన పలు ప్రశ్నలకు బండి సంజయ్ బదులిచ్చారు...

**నియోజకవర్గాల పునర్విభజనపై....**

నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్లను కేంద్రం అమలు చేస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్రెషన్ లోకి వెళుతున్నారు. ప్రధానమంత్రి స్థాయి వ్యక్తిపై దిగజారి మాట్లాడుతున్నారు. సీఎం భాషను చూసి తెలంగాణ సమాజం అసహ్యించుకుంటోంది. ఓట్ల కోసం 6 గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీలిస్తారు. అధికారంలోకి వచ్చాక గాడిద గుడ్డు చూపిస్తారు. లాగుల తొండలు విడుస్తానని అంటారు. ఇదేందని మేం మాట్లాడితే గుండు, బండి అని మాట్లాడతారే తప్ప ఆ హామీలను అమలు చేయాలనే సోయే ఉండదు.

**కవిత కొత్త పార్టీపై అడిగిన ప్రశ్నకు....**

ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ పెట్టుకోవచ్చు. స్వాగతిస్తాం. అయితే ప్రజల కోసం, పేదల కోసం ఏ పార్టీ పనిచేసినా ఆ పార్టీకే మనుగడ ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

**కాళేశ్వరం డిజైన్ లోపంపై....**

కాళేశ్వరం డిజైన్ లోపానికి ప్రధాన కారకులు కేసీఆరే. ఎందుకంటే ఆయన ఇంజనీర్ అవతారమెత్తారు. అనేక వేషాలు వేసి డిజైన్లు తయారు చేశారు. కాబట్టి దీనికి ప్రధాన బాధ్యత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం కాళేశ్వరం డిజైన్ కారకులను, అవీనీతిపరులను అరెస్ట్ చేయడం లేదు. ఎందుకంటే కేసీఆర్ తో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు. అందుకే అవినీతికి పాల్పడినా, డిజైన్ లోనే లోపముందని తేల్చినా చర్యలు తీసుకోవడం లేదు. ఇదేమని అడిగితే కేంద్రంపై నెపం మోపి తప్పించుకోవాలని చూస్తున్నారు. సీబీఐకి పంపిన లేఖలోనూ పూర్తిస్థాయిలో వాస్తవాలు చెప్పలేదు.

డీలిమిటేషన్ తో దక్షిణాదిరాష్ట్రాలకు అన్యాయంపై....

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి జరిగే నష్టం ఏమిటో ఇప్పటి వరకు సీఎం చెప్పలేదు. ఏ ప్రాంతానికి అన్యాయం జరగదు. అన్ని రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంచుతున్నప్పుడు దక్షిణాదికి అన్యాయం ఎట్లా జరుగుతుంది? 6 గ్యారంటీల అమలు చేయడం చేతగాక ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ డ్రామాలాడుతున్నరు. మహిళలకు నెలకు రూ.2500లు, వృద్దులకు రూ.4 వేల పెన్షన్, నిరుద్యోగులకు నిరుద్యోగ భ్రుతి, రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు రైతు భరోసా, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, మహిళలకు తులం బంగారం, స్కూటీ ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలి. ముందు వాటి సంగతి తేల్చిన తరువాత మాట్లాడాలి. అంతే తప్ప వాటిని అమలు చేయలేక రాష్ట్రాన్ని అప్పులు పాల్జేసి ప్రజలను దారి మళ్లించేందుకు ఉత్తరాది, దక్షిణాది అంటూ డ్రామాలాడుతున్నారు. రాష్ట్రాభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరించేందుకు సిద్దంగా ఉంది. రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధిపైన, 6 గ్యారంటీల అమలుపైన దృష్టి సారించాలని కోరుతున్నా.

# మెట్రో విస్తరణకు మార్గం సుగమం

కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్-1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్-2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవు తున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్-1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు. ఈ స్వాధీన ప్రక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్-2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్-2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫేజ్-2 విస్తరణకు త్వరితగతిన ఆమోదం పొందేందుకు కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, మెట్రో రైలుపై ప్రభుత్వ పెత్తనం పెరగడం వల్ల సామాన్య ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని, నగరం ప్రపంచ పటంలో ఒక అత్యాధునిక రవాణా వ్యవస్థ కలిగిన మెట్రోపాలిటన్‌గా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే అసెంబ్లీలో తీర్మానాలను ఏకపక్షంగా ఆమోదించడం సరికాదని ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. నష్టాలతో సతమతమవుతున్నామని, మెట్రో రైలు నిర్వహణ నుంచి తప్పుకొంటామని నాలుగైదేళ్లుగా ఎల్‌అండ్‌టీ సంస్థ చెబుతోంది. ఇదే విషయాన్ని గత సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది. సుదీర్ఘ చర్చల తర్వాత ఎల్‌అండ్‌టీ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణంతో పాటు సంస్థ ఈక్విటీ వాటా రూ.2 వేల కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రో రైలును టేకోవర్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు లేకుండానే ప్రభుత్వం కార్యకలాపాలను నిర్వహించనుంది. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని హరీష్ రావు అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శాసనసభలో ప్రకటించారు. సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తాం. సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుపై విచారణకు ప్రభుత్వం సిద్ధం అని తెలిపారు. గంగుల కమలాకర్ అక్రమ గ్రానైట్ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్‌పై విచారణకు సిద్ధం అని ప్రకటించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్‌తోపాటు అన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నాం అని తెలిపారు. విచారణలో నిజాలు నిగ్గు తేల్చి శాసనసభలో నివేదిక పెడతాం. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే. వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు ఇసుక మాఫియా నడిపారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతూ సాగే అక్రమ మైనింగ్ వ్యవహారాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడ గండి పడినా, ఖనిజ సంపద దోపిడీకి గురైనా తాము చూస్తూ ఊరుకోబోమని, అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన రాఘవ కన్స్ట్రక్షన్స్ అంశంపై ముఖ్యమంత్రి సాక్ష్యాధారాలతో సమాధానమిస్తూ, ఇప్పటికే ఆ సంస్థకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ జరిపిన విచారణలో భాగంగా రాఘవ కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుండి భారీ మొత్తంలో పన్నులు వసూలు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సినరేజ్ ఛార్జీల కింద రూ. 1,52,97,825, అలాగే పర్మిట్ ఫీజు కింద రూ. 22,25,446 మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పటికే ఆ సంస్థ నుండి కట్టించుకుందని ఆయన సభకు తెలిపారు. ఎవరైనా మంత్రుల పేర్లు చెప్పుకుని లేదా రాజకీయ పలుకుబడితో పన్నులు ఎగ్గొట్టాలని చూస్తే చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో రాజీపడేది లేదని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు.

# అందుబాటులోకి మరో అంతర్జాతీయ విమానాశ్రయం




నోయిడాను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నవారు నోయిడాలో పర్యటిస్తే అది వారికి అపశకునంగా మారుతుందనే నమ్మకం ఎంతోకాలంగా ప్రచారంలో ఉంది. దానిని ఉద్దేశించే మోదీ మాట్లాడారు. గతంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో అధికారంలో ఉన్నవారు తమ పదవులను కోల్పోతామనే భయంతో ఈ నగరానికి రావడమే మానేశారు. సమాజ్‌వాదీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓసారి నోయిడాకు వచ్చేందుకు ప్లాన్ చేసుకున్నాను. అప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ఆందోళనకు గురయ్యారు. ఆయన రాకపోగా.. నన్నుకూడా రావొద్దని చెప్పారు. 'మోదీజీ నోయిడా వెళ్లొద్దు. మీరు ఇటీవలే ప్రధాని అయ్యారు' అని చెప్పుకొచ్చారు. నేను వెంటనే 'ఆ ప్రాంత ప్రజల ఆశీర్వాదం కోసం వెళ్తాను. అది సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశాన్ని ఇస్తుంది' అని నాడు బదులిచ్చాను. అసలు ఈ నమ్మకానికి 1988 జూన్‌లో పునాది పడింది. అప్పుడు వీర్ బహదూర్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన నోయిడా వెళ్లి వచ్చిన కొన్ని రోజులకే సీఎం పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఆ తర్వాత మరికొందరు సీఎంలకు అలాంటి పరిస్థితే ఎదురైంది. 1989లో ఎన్‌డీ తివారీ, 1995లో ములాయంసింగ్ యాదవ్, 1997లో మాయావతి, 1999లో కల్యాణ్ సింగ్ కూడా ఆ నగర పర్యటన తర్వాతే సీఎం కుర్చీకి దూరమయ్యారు. ఈ నోయిడాను తప్పించుకోవడానికి నేతలు చిత్రవిచిత్రమైన కారణాలు వెతుక్కునేవారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజ్‌నాథ్ సింగ్ కూడా నోయిడా భయాన్ని విస్మరించలేకపోయారు. నోయిడా-దిల్లీని అనుసంధానించే డీఎన్‌డీ రైల్వేను నోయిడా నుంచి కాకుండా దిల్లీ వైపు నుంచి ప్రారంభించడం గమనార్హం అన్నారు. ఇక, 2013లో ఆ నగరంలో జరిగిన ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ సమిట్‌కు నాటి ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ హాజరుకాలేదు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ సమిట్‌కు చీఫ్‌గెస్ట్ అయినా కూడా యాదవ్ రాకపోవడం గమనార్హం. దాద్రి మూకదాడి బాధిత కుటుంబాన్ని నోయిడా వెళ్లి కలవలేక.. లఖ్‌నవూకే రప్పించుకున్నారాయన. అయితే యోగి ఆదిత్యనాథ్ మాత్రం నోయిడా మూఢనమ్మకాన్ని పట్టించుకోలేదు. ఆయన 2017లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పలుమార్లు ఆ నగరంలో పర్యటించారు. ఆ తర్వాత 2022లో రెండోసారి సీఎంగా గెలిచారు. 2027లో మరో దఫా ఎన్నికలకు వెళ్లనున్నారు. ఇకపోతే పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎదురవుతోన్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని మోదీ అన్నారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందన్నారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందన్నారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. దీనినుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఇక, ఇలాంటి సమయంలో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోన్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంపై ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయొద్దని రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు.. దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు. నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో-లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు. కార్యక్రమంలో యూపి సిఎం యోగి, కేంద్రమంత్రి రమ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఇక అమరావతి ప్రజారాజధాని

అమరావతి నుంచే పాలన సాగించారని గుర్తుచేశారు. ఆ కాలం నాటి అమరావతి విశేషాలను బ్రిటిష్ మ్యూజియంలో భద్రపరిచారని ముఖ్యమంత్రి తెలిపారు. తెలుగువారిని గతంలో 'మదరాసీలు' అని పిలిచేవారని.. టీడీపీ ఆవిర్భావం తర్వాత మదరాసీ అనే ముద్ర పోయిందని చంద్రబాబు గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో ఫ్రంట్ ఏర్పాటు చేసిన పార్టీ టీడీపీ అని ఆయన పేర్కొన్నారు. విభజన సమయంలో సమన్యాయం కోసం తాము కోరినట్లు చంద్రబాబు చెప్పారు. ఆనాడు పార్లమెంట్‌లో జగన్ కనిపించకుండా దాక్కున్నారని విమర్శించారు. విభజన తర్వాత ఏపీలో కార్యాలయాలు లేవని, బస్సులో ఉండి పరిపాలన చేశామని ఆయన వెల్లడించారు. అమరావతిలో అసెంబ్లీ, సచివాలయ భవనాలను కేవలం 9 నెలల్లోనే పూర్తి చేశామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.సింగపూర్ సహకారంతో ఆ స్థాయిలో రాజధాని నిర్మాణం కోసం ప్రణాళికలు ఇవ్వాలని కోరామని సీఎం తెలిపారు. 'ముందు దేశం బాగుండాలి.. అలా ఉండాలంటే మన జాతి బాగుండాలి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలి' అని అన్నారు. తెలుగు వాళ్లకు చెందిన హైదరాబాద్, అమరావతి తొలి రెండుస్థానాల్లో ఉండాలన్నదే తన సంకల్పమని స్పష్టం చేశారు.

విజయవాడ- గుంటూరు మధ్య రాజధాని పెట్టాలని 46 శాతం మంది కోరుకున్నట్టు శివరామకృష్ణన్ కమిటీ స్పష్టంగా చెప్పిందన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తూ వివిధ జాతీయ స్థాయి సంస్థలను రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న వ్యక్తి రాజధాని అమరావతికి బేషరతుగా మద్దతు ఇస్తామని చెప్పారని.. కానీ రోజుకో మాట మార్చేసి ఊసరవెల్లి రాజకీయాలు చేశారని సీఎం విమర్శించారు. టెక్నాలజీ అందుబాటులో ఉన్న రోజుల్లోనూ రాజకీయ విన్యాసాలు చేశారన్నారు. వంద ఎకరాలు తీసుకుని భవనాలు కట్టేసి రాజధాని అని చెప్పేయవచ్చని.. కానీ రాష్ట్రానికి ఆర్థిక వనరులు సమకూరేలా ఓ ప్రాంతం ఉండాలని ఆలోచించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని రైతులను సంప్రదించగా 58 రోజుల్లో 34 వేల ఎకరాలను రాజధాని కోసం ఇచ్చేశారన్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని సీఎం తెలిపారు. రాజధాని పట్ల కుట్రలు చేసిన కొందరు వక్తులు తోటలకు నిప్పు పెట్టారని మండిపడ్డారు. ప్రపంచ బ్యాంకుకు ఈమెయిళ్లు పెట్టారని ఫైర్ అయ్యారు. కానీ పవిత్రమైన మట్టి, నీరుతో ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని... అందుకే ఇది శాశ్వతంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# సంపాదకీయం..

## ట్రంప్‌ను నిలువరించేదెవరు?

పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు ఆరేలా లేవు. పరస్పర దాడులతో మరింత ఉద్రిక్తంగా మారుతోంది. దీంతో ప్రపంచ దేశాలు ఏమీ చేయలేని దుస్థితిలో ఉండిపోయాయి. అమెరికాను నిలువరించే పరిస్థితి ఏ దేశానికి లేకుండా పోయింది. సుంకాలు విధించినా చైనా, భారత్ లాంటి దేశాలు సైతం కిమ్మనకుండా మిన్నకుండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు చమురు సంక్షోభం నేపథ్యంలోనూ అమెరికాను కట్టడిచేయగల శక్తి ఎవరికీ లేకుండా పోయింది. ట్రంప్ కూడా ఆయుధ బలంతో రెచ్చిపోతున్నాడు. ఇది ప్రపంచ వినాశనానికి కంకణం కట్టుకున్నట్‌ఉగా ఉంది. ఇంతటితోనే ఇది ఆగుతుందనుకోవడానికి లేదు. ఇక భూతలదాడులు జరిగితే నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది. ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10 లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించింది. ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో తీవ్ర సంక్షోభం నెలకొన్నా పట్టించు కోవడం లేదు. ఆర్థికంగా దెబ్బతింటున్న పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థన లు వస్తున్నట్లు వెల్లడించాయి. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్ తగ్గించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్లు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్లు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఐయాల్ జమీర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సహా ఇతర ఉన్నతాధికారులకు కూడా ఆయన లేఖ రాశారు. ఇకపోతే హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ సాగిస్తున్న దిగ్బంధనంతో నౌకాయానం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభానికి ఇది కారణమైంది. ఇప్పుడు మరో జలసంధికి ముప్పు ముంచుకొచ్చింది. తమ ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే బాబ్ అల్ మాండెబ్ జలసంధిని అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించడమే ఇందుకు కారణం. ఆ నౌకామార్గమూ మూసుకుపోతే ప్రపంచానికి మరిన్ని కష్టాలు తప్పవంటున్నారు. అరేబియా ద్వీపకల్పానికి పశ్చిమాన మరో జలమార్గమే బాబ్ అల్ మాండెబ్ జలసంధి. అరబిక్ భాషలో బాబ్ అల్ మాండెబ్ అంటే 'కన్నీటి ద్వారం' లేదా 'విషాద ద్వారం' అని అర్థం. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా అనేక నౌకలు ప్రమాదానికి లోనయ్యాయి. అందువల్లే ఈ మార్గానికి ఆ పేరు వచ్చింది. 1869లో సూయజ్ కాలువను తెరిచాక మాండెబ్ జలసంధికి ప్రాముఖ్యత పెరిగింది. ఇది మధ్యధరా సముద్రం, హిందుమహాసముద్రానికి మధ్య కీలక లంకెగా మారింది. మాండెబ్ జలసంధికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇది యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయెజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక నడవాగా మారింది. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌కు మధ్య ద్వారంలా వ్యవహరిస్తోంది. దీని వెడల్పు 30 మీటర్లు మాత్రమే.ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకల మధ్య మాండెబ్ జలసంధి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యం లో 10-12 శాతం దీని గుండానే పయనిస్తోంది. ప్రధానమైన మార్కెట్ల మధ్య ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ), తయారీ వస్తువులు, ఆహార పదార్థాలు ఈ మార్గంలోనే రవాణా అవుతున్నాయి. ఏటా రూ.93.95 లక్షల కోట్ల విలువైన సరకులు మాండెబ్ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా. తన అజమాయిషీ లో పనిచేసే హూతీలను ఇప్పటికే మాండెబ్ మార్గంలో ఇరాన్ మోహరించింది. యెమెన్‌లోని ఈ ముఠా.. ఎర్ర సముద్ర తీరంలోని కొన్ని భాగాలను నియంత్రిస్తోంది. సముద్రంలోని లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యం ఈ ముఠాకు ఉంది. 2023 అక్టోబరు 7న గాజా యుద్ధం చెలరేగాక.. పాలస్తీనావాసులకు సంఘీభావంగా హూతీలు రంగంలోకి దిగారు. ఇరాన్, చైనాలు అందించిన డ్రోన్లు, నౌకా విధ్వంసక క్షిపణులు, విస్ఫోటక బోట్లతో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీంతో ప్రధాన నౌకాయాన కంపెనీలు వేరే మార్గంలో పయనించాల్సి వచ్చింది. 2 నెలల కాలంలో 134 నౌకలపై దాడి చేశారు. ఫలితంగా ఎర్ర సముద్ర వర్తక నడవాలో అంతర్జాతీయ వాణిజ్యం 60 శాతానికిపైగా తగ్గింది. ఇందులో చాలావరకూ పశ్చిమ దేశాలతో ముడిపడినవే. నాలుగు నౌకలు మునిగిపోయాయి. మాండెబ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధిస్తే సరకు రవాణా నౌకలు ఆఫ్రికాలోని దక్షిణ భాగం నుంచి పయనించాల్సి వస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయంతోపాటు ఖర్చులూ పెరుగుతాయి. ఇది అంతిమంగా చమురు ధరల పెరుగుదలకు, ఇంధన మార్కెట్‌లో మరింత అస్థిరతకు దారితీయవచ్చు. అయితే ఈ జలసంధి దిగ్బంధనానికి ప్రయత్నిస్తే అమెరికా గట్టిగా ప్రతిఘటించవచ్చు. మాండెబ్ జలసంధిలో జిబౌటి వైపున అగ్రరాజ్యానికి భారీ సైనిక స్థావరం ఉంది.

## మారనున్న ఆస్కార్ వేడుకల వేదిక

**- 2029 నుంచి పీకాక్ థియేటర్‌లోకి మార్పు**




**లాస్‌ఏంజిల్స్,మార్చి28( తెలుగురేఖ):**
ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'అకాడమీ అవార్డ్స్' ఆస్కార్ ఒక చారిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా హాలీవుడ్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలు, 2029 నుంచి లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని కొత్త వేదికకు మారనున్నాయి. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించిన వివరాల ప్రకారం, 2029 నుంచి 2039 వరకు పదేళ్ల పాటు ఈ వేడుకలు లాస్ ఏంజిల్స్ లైవ్ కాంప్లెక్స్‌లోని 'పీకాక్ థియేటర్'లో జరగనున్నాయి. ఇందుకోసం ప్రముఖ వినోద సంస్థ తో అకాడమీ ఒప్పందం కుదుర్చుకుంది. 2001 నుంచి ఆస్కార్ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్న హాలీవుడ్ బౌలేవార్డ్ లోని 'డాల్బీ థియేటర్' యుగం, 2028లో జరగబోయే 100వ వార్షికోత్సవ వేడుకలతో ముగియనుంది. అప్పటివరకు ఈ వేడుకలు ఎబిసి ఛానల్‌లోనే ప్రసారమవుతాయి. అయితే, 2029 నుంచి 2033 వరకు జరిగే ఆస్కార్ వేడుకల ప్రసార హక్కులను యూట్యూబ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దీనివల్ల రెడ్ కార్పెట్, తెరవెనుక విశేషాలు మరియు ప్రధాన వేడుక వంటివన్నీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా అభిమానులు యూట్యూబ్‌లో ఉచితంగా వీక్షించే అవకాశం కలగనుంది. అత్యాధునిక సాంకేతికత కలిగిన వేదికపై సినిమా పండుగను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడానికి ఈ మార్పు ఎంతో దోహదపడుతుందని అకాడమీ ప్రతినిధులు పేర్కొన్నారు.

## టెన్త్ ఎగ్జామ్స్ యధావిధిగా ఉంటాయి

**- క్లారిటీ ఇచ్చిన విద్యా కమిషన్**



**హైదరాబాద్, మార్చి28( తెలుగురేఖ):**
తెలంగాణలో టెన్త్ బోర్డ్ ఎగ్జామ్స్ జరుగుతున్న సమయంలో వచ్చే ఏడాది నుంచి వీటిని రద్దు చేస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. తెలంగాణలో సెకండరీ స్కూల్ సర్టిఫికేట్ పరీక్షలను రద్దు చేస్తున్నారనే వదంతులపై తెలంగాణ విద్యా కమిషన్ క్లారిటీ ఇచ్చింది. ప్రభుత్వ పరిశీలనలో అటువంటి ప్రతిపాదనేదీ లేదని ౹ఇఆ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ విద్యా విధానం 2026 విధాన పత్రాన్ని విడుదల చేసిన తర్వాత తెలంగాణలో ౹ూఆ పరీక్షల రద్దుపై పుకార్లు మొదలయ్యాయి. ఆ డాక్యుమెంట్‌లో ఎస్ఎస్‌సి బోర్డును ఇంటర్మీడియట్ బోర్డుతో విలీనం చేయడం వంటి సంస్కరణలను సూచించారు. పదో తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేయాలని ఎక్కడా సూచించలేదు. అయితే, కొన్ని ప్రైవేట్ స్కూల్స్ 11, 12 తరగతులను స్కూల్లో మొదలుపెట్టాయి. దాంతో టెన్త్ బోర్డ్ ఎగ్జామ్స్ రద్దు అని వదంతులు త్వరగా వ్యాపించాయి.తెలంగాణ రాష్ట్రంలో మార్చి 14న ప్రారంభమైన పదో తరగతి బోర్డు పరీక్షలు ఏప్రిల్ 16 వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలను ప్రభుత్వం 6 పేపర్ల విధానంలో నిర్వహిస్తోంది. ప్రతి రోజూ ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు (3 గంటల పాటు) పరీక్షలు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 2,676 ఎగ్జామ్ సెంటర్లలో సుమారు 5,28,239 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. నిబంధనల విషయానికి వస్తే, విద్యార్థులకు కేవలం 5 నిమిషాల ఆలస్య అనుమతి మాత్రమే ఉంటుంది. పరీక్షలు ముగిసిన అనంతరం, ఫలితాలను ఏప్రిల్ చివరి వారం లేదా మే 2026లో విడుదల చేసే అవకాశం ఉంది.తెలంగాణ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యా రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ప్రకటించారు.జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో ప్లస్ టూ (+2) విద్యా విధానాన్ని మరింత పటిష్టం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. విద్యా సంస్కరణలపై నియమించిన కమిటీ ప్రస్తుతం అధ్యయనం చేస్తోందని, వారు సమర్పించేది ప్రాథమిక నివేదిక మాత్రమేనని, అది తుది నిర్ణయం కాదని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.ప్రస్తుతం పదో తరగతి బోర్డు పరీక్షల రద్దుపై ప్రభుత్వం ఎటువంటి అధికారిక ఉత్తర్వులు (ఉా) జారీ చేయలేదు. విద్యాశాఖ కమిషన్ ఇచ్చే సిఫార్సులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది. తెలంగాణలో టెన్త్ పరీక్షల రద్దుపై వస్తున్న పుకార్లను నమ్మవద్దని, విద్యార్థులు తమ ప్రిపరేషన్‌ను యథావిధిగా కొనసాగించాలని సూచించారు.

## జర్నలిస్టుల సంక్షేమంలో ఎప్పుడూ ముందున్నా

- **గతంలో ఉమ్మడి ఎపిలో అనేక కార్యక్రమాలు చేపట్టా**
- **వారికి ప్రాధాన్యక్రమంలో భూములు ఇస్తాను**
- **సోషల్ మీడియా వ్యక్తిత్వ హననంపై ఆందోళన**
- **ఐజెయూ సమవేశంలో సిఎం చంద్రబాబు**




**విజయవాడ,మార్చి 28 తెలుగురేఖ:**
జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడడంలో తానే ముందున్నానని, ఉమ్మడి ఎపిలో అయినా, విభజిత ఎపిలో అయినా అనేక సంక్షేమ చర్యలు చేపట్టామని సిఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ 11వ ప్లీనరీ సమావేశాల ప్రారంభ కార్యక్రమంలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి కాలంలో సోషల్ మీడియా ఓ పెద్ద సవాలుగా మారిందని అన్నారు. కొందరు వ్యక్తులు కేవలం అసభ్యకరమైన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి, ఇతరుల వ్యక్తిత్వ హననం చేయడానికే సామాజిక మాధ్యమాలను వాడుతున్నారని మండిపడ్డారు. 'తప్పుడు ప్రచారాలతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారు. ఇది దేశానికి చాలా ప్రమాదకరం. దీనిని ఎలా నియంత్రించాలో, ప్రజలను ఎలా చైతన్యపరచాలో మనమందరం ఆలోచించాలి. రాబోయే ఒకటి రెండేళ్లలో 3వ స్థానానికి, 2038 నాటికి 2వ స్థానానికి, 2047 లేదా 2050 నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా మన దేశం ఎదిగే అవకాశముందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపోతే గతంలో హైదరాబాద్‌లో ప్రెస్ క్లబ్‌లకు, జర్నలిస్టులకు విలువైన ప్రాంతాల్లో భూములిచ్చామన్నారు. అమరావతిలోనూ పాత్రికేయుల నివాసాల కోసం భూమి కేటాయించేందుకు సానుకూలంగా పరిశీలిస్తామని భరోసానిచ్చారు. మండల రిపోర్టర్లకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించడం సహా జర్నలిస్ట్ సంక్షేమ నిధి ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రమాద బీమా సౌకర్యాన్ని పది లక్షల రూపాయలకు పెంచామని.. డెస్క్ జర్నలిస్టులకు, సబ్ ఎడిటర్లకూ అక్రిడిటేషన్, బస్సు ప్రయాణ రాయితీలు కల్పించామని చెప్పుకొచ్చారు. అమరావతిలో భూమి మానిటైజేషన్ ప్రాజెక్ట్ అయినప్పటికీ.. ఓ పద్ధతి ప్రకారం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిర్ణయం తీసుకుంటాం. గతంలో కేవలం కమ్యూనిస్ట్ పార్టీలే తమ సిద్ధాంతాలను ప్రచారం చేసుకోవడానికి సొంత పత్రికలను కలిగిఉండేవి. కానీ.. నేడు రాజకీయ నాయకులే స్వయంగా మీడియా సంస్థలను నడుపుతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమైన ధోరణి. వృత్తిపరమైన మీడియా, రాజకీయ పార్టీల యాజమాన్యంలోని మీడియాల మధ్య స్పష్టమైన తేడా ఉండాలని నేను కోరుకుంటున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా తాను రాజకీయాల్లో ఉన్నానని ఈ సందర్భంగా స్మరించుకున్నారు చంద్రబాబు. కరెంటులేక పొలాలు ఎండిపోతున్నాయని తాను అసెంబ్లీని వాయిదావేసి మరీ క్షేత్రస్థాయికి వెళ్లిన రోజులు గుర్తున్నాయన్నారు. '90వ దశకం చివరలో నేను విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాను. దేశం కోసం, రాష్ట్రం కోసం నేను విద్యుత్ తీసుకొచ్చినా.. దురదృష్టవశాత్తూ 2004లో అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ఎప్పుడూ కలిసే సాగాలి. నేడు సమాజంలో విలువలు పడిపోవడం, సిద్ధాంతాలు మారిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టీ.రామారావును ఒకసారి 'మీరు కమ్యూనిజమా, సోషలిజమా లేక క్యాపిటలిజమా?' అని అడిగితే.. తానొక 'ఉత్తమ మానవతావాదిని' అని ఆయన సమాధానమిచ్చారు' అని ముఖ్యమంత్రి నాటి జ్ఞాపకాలను గురించి వివరించారు. హైదరాబాద్ అభివృద్ధి గురించి ఏపీ సీఎం మాట్లాడుతూ.. 'హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామంటే నాడు అందరూ నవ్వుకున్నారు. కానీ పాతికేళ్ల తర్వాత నేడు తెలంగాణ తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న గ్లోబల్ కాంపిటెన్సీ సెంటర్లలో 25 శాతం హైదరాబాద్‌కే వస్తున్నాయి. రాష్ట్ర విభజన కంటే కూడా 2019 నుంచి 2024 మధ్య జరిగిన విధ్వంసం వల్లే ఆంధ్రప్రదేశ్ ఎక్కువగా నష్టపోయింది. మళ్లీ మనం అశ్రద్ధ చేస్తే, సమస్యలు వస్తాయనే విషయం గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా మూడు రాజధానులని మాట్లాడారు. కొంతవరకు మీడియా అంతా కూడా దీనిని ఖండించారు, అయినా పట్టించుకోలేదని చంద్రబాబు చెప్పారు.

## ఇరాన్ నేత మొజ్తబా ఖమేనీ కూడా మరణించే ఉంటాడు

**- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు**
**- తదుపరి తమ టార్గెట్ క్యూబా అంటూ హెచ్చరిక**



**వాషింగ్టన్,మార్చి28( తెలుగురేఖ):**
ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ మరణించి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైనిక దాడులు ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తుడిచిపెట్టాయని, దీంతో ఆ దేశంలో నాయకత్వం లేకుండా పోయిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికాలోని మయామిలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ ప్రయారిటీ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా కార్యకలాపాల వల్ల ఇరాన్ బలహీనపడిందని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలను నిర్మూలించడంలో అమెరికా దళాలు అంచనాలకు మించి పనిచేశాయని ఆయన అన్నారు. 'ఇరాన్ నౌకాదళం అంతమైపోయింది. అదంతా అఖాతపు అడుగున మునిగిపోయింది.. వారి వైమానిక దళం పూర్తిగా, సమూలంగా నాశనమైంది. వారి విమాన నిరోధక, సమాచార ప్రసార సామర్థ్యాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. అంతేకాదు, ఇరాన్ నాయకత్వం, సైనిక శక్తి కూడా నాశనమైంది. వారి నాయకులందరూ చనిపోయారు.. వారి సుప్రీం లీడర్ ఇక సర్వోన్నతుడు కాదు. ఆయన మరణించారని ట్రంప్ అన్నారు. ఇరాన్ ఆయుధ నిల్వలను తాము చిన్నాభిన్నం చేస్తున్నామని, ఎవరూ ఊహించని స్థాయిలో వారి క్షిపణి, డ్రోన్ కర్మాగారాలను ధ్వంసం చేస్తున్నామని ట్రంప్ తెలిపారు. వారి రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని తుడిచిపెట్టేశామని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆయతొల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత, ఆయన కుమారుడైన మొజ్తబా ఖమేనీ ఇరాన్ బాధ్యతలు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. ఆయన ఇరాన్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతుడిగా, వివాదాస్పద వ్యక్తిగా పేరు పొందారు. అయితే, ఆయన బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఇటువంటి వార్తలు రావడం గమనార్హం. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా ధృవీకరించలేదు, ఖండించలేదు. సాధారణంగా ఇరాన్ తన అత్యున్నత నాయకుల ఆరోగ్య స్థితిగతులను అత్యంత రహస్యంగా ఉంచుతుంది. గతంలో కూడా అలీ ఖమేనీ ఆరోగ్యంపై అనేక పుకార్లు వచ్చినప్పుడు ఇరాన్ నిశ్శబ్దంగానే ఉంది. ఇదే క్రమంలో వెనిజులా, ఇరాన్ తర్వాత క్యూబాపైనే అమెరికా సైన్యం దాడులు జరపనున్నట్లు ట్రంప్ హెచ్చరించారు. వెనిజులా, ఇరాన్‌పై అమెరికా సైన్యాలు విజయం సాధించాయని ట్రంప్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికా సైన్యపు విజయాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఈ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం ఇటీవలి వారాల్లో క్యూబా నాయకత్వంలోని కొన్ని వర్గాలతో చర్చలు ప్రారంభించాం.. అమెరికా సైన్యం క్యూబాపై ప్రత్యక్ష సైనిక చర్యకు పాల్పడవచ్చుని ' అని కూడా ఈ సందర్భంగా ట్రంప్ చెప్పారు. కొన్నిసార్లు సైన్యాన్ని ఉపయోగించాల్సి వస్తుంది. అన్నట్టు తర్వాతి వంతు క్యూబాదే' అని అన్నారు. ఈ మాటలు అన్నతర్వాత ట్రంప్ మరలా.. నేను అలా అనలేదని అనుకోండి అని ట్రంప్ అన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో జరగబోయే సైనిక ఘర్షణను నివారించే ప్రయత్నంలో తమ దేశం అమెరికాతో చర్చలు జరుపుతోందని క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ అంగీకరించారు. ఇప్పటికే అమెరికా ఆంక్షల వల్ల క్యూబాకు సరఫరా అయ్యే చమురు దిగుమతులు తగ్గాయి. దీంతో విద్యుత్ ప్లాంట్లు, రవాణాను నడపడానికి ఆధారపడే చమురు లేక క్యూబా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది.జనవరిలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోని ఆయన భార్యని పట్టుకోవడానికి అమెరికా చేపట్టిన ఆపరేషన్‌కు ముందు.. క్యూబాకు అవసరమైన చమురులో అధిక భాగం వెనిజులా సరఫరా చేసింది. కానీ ఆ తర్వాత వాషింగ్టన్ ఒత్తిడితో కారకాస్‌లోని కొత్త ప్రభుత్వం క్యూబాకు చమురు సరఫరాలను నిలిపివేసింది.

## తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

స్ఫూర్తి కనుమరుగైందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. బీఆర్ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్-2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం అన్నారు.

క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం అని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబోతున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. ఫుట్‌బాల్‌లో గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన వారిలో నలుగురు మన ప్రాంతానికి చెందినవారున్నారు. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## గోదావరిలోకి దూకి తల్లీబిడ్డల ఆత్మహత్యాయత్నం

**- వెంటనే నదిలోకి కాపాడిన మత్స్యకారులు**



**భద్రాచలం, మార్చి28( తెలుగురేఖ):** భద్రాచలం గోదావరి వంతెన పై శనివారం మధ్యాహ్నం తీవ్ర కలకలం రేగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ఓ మహిళ తన చిన్నారితో సహా వంతెనపై నుంచి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం పాల్వంచకు చెందిన ఆ మహిళ శనివారం మధ్యాహ్నం తన బిడ్డతో కలిసి భద్రాచలం గోదావరి వంతెన వద్దకు చేరుకుని చిన్నారితో సహా నదిలోకి దూకింది. గమనించిన ప్రయాణికులు, స్థానికులు ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు వారిని వెంటనే కాపాడారు. క్షేమంగా తల్లీబిడ్డను బయటకు తీసుకువచ్చి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

## మంటలు చెలరేగి కారు దగ్ధం



**యాదాద్రి భువనగిరి, మార్చి28( తెలుగురేఖ):** బీబీనగర్ మండలం పరిధిలో జైన్ కంపెనీ సమీపంలో కేపాల్ వద్ద ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ కారు వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కారు ఇంజిన్ నుంచి మంటలు రావడాన్ని గమనించిన కారు యజమాని అప్రమత్తమై వాహనం ఆపి, అందులో నుంచి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కానీ మంటలు వేగంగా వ్యాపించడంతో కారు మాత్రం పూర్తిగా దగ్ధమైంది.


## వారం రోజుల వ్యవధిలో ఇద్దరు ఉద్యోగుల మృతి

**- ఆకస్మిక గుండెపోటుతో మృతిపై ఆందోళన**




**హైదరాబాద్, మార్చి28( తెలుగురేఖ):** హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ స్థాయి వ్యవసాయ పరిశోధన, విద్యా నిర్వహణ సంస్థలో వరుస గుండెపోటు మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు మరణించడం అక్కడి సిబ్బందిని దిగ్భ్రాంతికి గురిచేసింది. తాజాగా శుక్రవారం రాత్రి అనిల్ కుమార్ అనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి మరణించాడు. బిహార్‌కు చెందిన అనిల్ కుమార్ ట్రైనింగ్ నిమిత్తం హైదరాబాద్‌లోని నార్మ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలాడు. అతనికి చికిత్స అందించేలోపే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. గత ఆదివారం కూడా నార్మ్‌లో విషాదం చోటుచేసుకుంది. సైంటిస్ట్ దామోదర్ రాత్రి భోజనం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో మరణించాడు. ఇలా వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు గుండెపోటుతో మరణించడంతో నార్మ్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.


## భారంగా మారుతున్న రోజా



**తిరుపతి, మార్చి28( తెలుగురేఖ):** మాజీ మంత్రి ఆర్కే రోజా వంటి వారితో వైసీపీకి లాభం కంటే నష్టమే ఎక్కువగా జరుగుతుంది. ఇటీవల ఆమె చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పై చేసిన వ్యాఖ్యలతో పార్టీకి నష్టమేనంటున్నారు. రోజా ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారన్నారని, ఆమెను అదుపులో పెట్టాల్సిన పార్టీ నాయకత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తే మరింత డ్యామేజీ కాక తప్పదని హెచ్చరిస్తున్నారు. అనవసర విషయాల్లో వేలుపెట్టడం రోజాకు అలవాటు. సినిమా డైలాగుల్లా రాజకీయనేతలు మాట్లాడితే అవి వికటిస్తాయని అంటున్నారు. పాలు పితకడం వంటి వ్యాఖ్యలతో వైసీపీకి మరింత నష్టం చేకూరిందని అంటున్నారు.వైసీపీకి మాజీ మంత్రి రోజా రోజురోజుకూ భారంగా మారుతున్నారు. నేతల అరెస్ట్ లతో కాస్తో కూస్తో వైసీపీకి సానుభూతి లభిస్తుందని భావిస్తే, రోజా తరచూ చేస్తున్న వ్యాఖ్యలతో అవి కనపడకుండా పోతున్నాయని, రోజా వ్యాఖ్యలను ఎవరూ హర్షించకపోవడమే కాకుండా ప్రజలను పార్టీకి మరింత దూరం చేసే విధంగా ఉందని అంటున్నారు. రోజా లాంటి నేతల నోళ్లను కొన్నాళ్లపాటు అదుపులో పెట్టకపోతే జగన్ కు వచ్చే ఎన్నికల్లోనూ తీరని నష్టం జరుగుతుందన్న విశ్లేషణలు కూడా వెలువడుతున్నాయి. కానీ రోజా విషయంలో జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఆమె మరింత రెచ్చిపోతున్నారు.ఆర్కే రోజా తొలుత తనను అరెస్ట్ చేస్తారేమోనని భయపడి కొన్నాళ్లు రాజకీయాలకు దూరంగా ఉన్నారు.కానీ తనపై ఎలాంటి కేసులు నమోదు కాకపోవడంతో పాటు కూటమి ప్రభుత్వం కూడా చూసీ చూడనట్లు వదిలేయడం వల్ల రోజా ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారని అంటున్నారు. అధికార పార్టీ కొద్దో గొప్పో వస్తున్న వ్యతిరికేతను రోజా లాంటి నేతలు తమ మాటలతో కప్పిపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్న అభిప్రాయం వైసీపీ నేతల్లోనూ వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా జగన్ రోజాను కట్టడి చేయకపోతే వైసీపీకి రానున్న కాలంలో మరింత ఇబ్బందులు తప్పవంటున్నారు.

# అమరావతి రాజధానిపై చట్టబద్ధ బిల్లు

**- ఇది చారిత్రిక సన్నివేశం అన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు**
**- ఈ సమావేశానికి ఎంతో ప్రాధాన్యం ఉందని వ్యాఖ్య**



**అమరావతి, మార్చి28( తెలుగురేఖ):** ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం శనివారం ఉదయం ప్రారంభమైంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లును ప్రవేశపెట్టారు. ఉదయం సరిగ్గా 11 గంటల 11 నిమిషాలకు శాసనసభలో ఈ బిల్లును సీఎం ప్రవేశపెట్టడంతో తీర్మానంపై చర్చ మొదలైంది. తీర్మానంపై 20 మందికి పైగా సభ్యులు మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ.. ఈ శాసనసభ సమావేశానికి ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. రాష్ట్ర ప్రగతికి ఎదురయ్యే సవాళ్లను అధిగమించే యజ్ఞం ఈ సమావేశంతో మొదలవుతోందని స్పీకర్ అన్నారు. 2014లో నడిసంద్రంలో చుక్కాని లేని నావలా ఆంధ్రప్రదేశ్ ఉందని.. అలాంటి సమయంలో దార్శనికుడు చంద్రబాబుకు రాష్ట్రాన్ని ప్రజలు అప్పగించారని తెలిపారు. చంద్రబాబు ప్రగతి బాటలో నడిపించాలని ప్రణాళికలు రూపొందించారన్నారు. అందరి సంప్రదింపులతో అమరావతిని రాజధానిగా ఖరారు చేశారని అన్నారు. ఈ ప్రాంతంలోని రైతులు తమ ప్రాణప్రదమైన భూములను రాజధాని కోసం విరాళంగా ఇచ్చారని తెలిపారు. అన్నదాతల అండతోనే రాజధానికి భూమి లభించిందని... అమరావతి రాజధాని పనులు వేగంగా ముందుకు సాగాయని స్పీకర్ తెలిపారు. 2019లో అమరావతికి అడ్డంకులు ఎదురయ్యాయన్నారు స్పీకర్. మూడు రాజధానుల పేరిట తప్పుడు నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడు పాత నిర్ణయాలు కొనసాగించాలనే సూత్రానికి విరుద్ధంగా అప్పటి ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. చేతికి కొబ్బరికాయ చిక్కినట్లు ప్రవర్తించి, అప్రజాస్వామిక విధానాలతో రాష్ట్రం 50 ఏళ్లు వెనక్కు వెళ్లిందని వ్యాఖ్యానించారు. పాలకులు కూడా విధ్వంసానికి పాల్పడవచ్చని ఈ సంఘటనలు నిరూపించాయని స్పీకర్ వెల్లడించారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా అమరావతిని శాశ్వత రాజధానిగా చేస్తున్నారని స్పీకర్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ధృడ సంకల్పం ఫలితంగా దీనికి కేంద్ర ప్రభుత్వం సమ్మతించిందన్నారు. ఈ మేరకు అమరావతి రాజధానిగా తీర్మానం చేసేందుకు అవకాశం వచ్చిందని తెలిపారు. తెలుగు ప్రజలు గర్వించదగ్గ రోజు ఇది అని చెప్పుకొచ్చారు. ఈ చరిత్రాత్మక సమావేశానికి 11 మంది వస్తారని అనుకున్నామని... చేసిన తప్పును ఒప్పుకునే ధైర్యం వారికి లేదని తెలిసిపోయిందన్నారు. అమరావతి తీర్మానంపై జరిగే చర్చ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. 'ఇలాంటి చరిత్రాత్మక సందర్భంలో మాట్లాడే అవకాశం మీ అదృష్టం. అందరూ అర్థవంతంగా చర్చలో పాల్గొని మాట్లాడాలి' అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు.

# చీలిన ఓట్లు.. ఎవరికి తూట్లు..



**హైదరాబాద్, మార్చి28( తెలుగురేఖ):** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఒక పెను సంచలనం ముంచుకొస్తోంది. కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ అస్తిత్వం కోసం తెలంగాణ ప్రజా జాగృతి పేరిట కొత్త పార్టీని ప్రకటిస్తున్నారు. ఈ పరిణామం కేవలం ఒక కొత్త పార్టీ ఆవిర్భావం మాత్రమే కాదు, బీఆర్ఎస్ పార్టీ పునాదులను కదిలించే ఒక వ్యూహాత్మక చీలికగా చెప్పుకోవచ్చు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఉన్న అత్యంత బలమైన ఓటు బ్యాంకులో చీలిక తేవడమే కవిత ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. ఒక కొత్త పార్టీగా కవిత కేవలం 4 నుండి 5 శాతం ఓట్లను చీల్చగలిగినా, అది బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారనుంది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో దెబ్బతిన్న బీఆర్ఎస్, ఇప్పుడు కవిత రూపంలో ఎదురవుతున్న ఈ ఇంటి పోరు ను తట్టుకోవడం కష్టతరమే. ముఖ్యంగా తెలంగాణ సెంటిమెంట్, సాంస్కృతిక అంశాలపై పట్టున్న కవిత, బీఆర్ఎస్ కోర్ ఓటర్లను తనవైపు తిప్పుకుంటే ఆ పార్టీ కోలుకోవడం అసాధ్యం కావచ్చు.బీఆర్ఎస్ పార్టీలో ప్రస్తుతం కేటీఆర్ ఆధిపత్యం పెరిగిందని, సీనియర్లకు ప్రాధాన్యత తగ్గటంపై లోలోపల తీవ్ర అసంతృప్తి నెలకొంది. కేసీఆర్ మౌనం, హరీష్ రావు ఇరకాటం వంటి పరిస్థితులతో .. పార్టీలో గుర్తింపు లేని ద్వితీయ శ్రేణి నాయకులు, టిక్కెట్లు దక్కని ఆశావాహులు ఇప్పుడు కవిత వైపు చూస్తున్నారు. కవిత పార్టీ ప్రకటన వెలువడగానే, బీఆర్ఎస్ నుండి భారీగా వలసలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. అవకాశాలు రాని నేతలకు కవిత ఒక ప్రత్యామ్నాయ వేదికగా మారడం బీఆర్ఎస్ క్యాడర్‌ను నిలువునా చీల్చనుంది.కేటీఆర్, హరీష్ రావుల తీరుపై గుర్రుగా ఉన్న కవిత, తనపై జరిగిన రాజకీయ కుట్రలకు ప్రతీకారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ కవితతో సర్దుకుపోయే ప్రసక్తే లేదని సంకేతాలిస్తుంటే, అటు తండ్రిగా కేసీఆర్ వారించలేక, ఇటు పార్టీని కాపాడుకోలేక మౌనం వహిస్తున్నారు. ఈ అంతర్గత కలహాలు బీఆర్ఎస్ బలహీనపడటానికి ప్రధాన కారణం కానున్నాయి. కవిత పార్టీ పెట్టడం వెనుక ఉన్న బలమైన ఉద్దేశ్యం అధికారం కంటే కూడా, తనను దూరం పెట్టిన బీఆర్ఎస్ నేతలకు ఒక గట్టి పాఠం చెప్పడమేనని అర్థమవుతోంది. కవిత చేయబోయే అధికారిక ప్రకటనతో తెలంగాణలో సరికొత్త సమీకరణాలు మొదలవుతాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ నుండి బయటపడిన తర్వాత బాధితురాలిగా ప్రజల్లోకి వెళ్లాలని ఆమె యోచిస్తున్నారు. వ్యక్తిగా వెళ్తున్నాను.. రాజకీయ శక్తిగా తిరిగి వస్తాను అన్న ఆమె నినాదం ఇప్పుడు బీఆర్ఎస్ అధినాయకత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కవిత చీల్చే ప్రతి ఓటు కూడా బీఆర్ఎస్ విజయవకాశాలను దెబ్బతీస్తూ, పరోక్షంగా ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే అవకాశం ఉంది. ఈ సమస్యను అధిగమించే పరిష్కారం బీఆర్ఎస్ వద్ద కనిపించడం లేదు.

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు..
# బతుకును ఛిద్రం చేసుకోవద్దు

**- ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక**



**హైదరాబాద్,మార్చి28( తెలుగురేఖ):** బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్–2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.


## అత్యవసరంగా ల్యాండ్ అయిన ఇండిగో




**న్యూఢిల్లీ,మార్చి28( తెలుగురేఖ):** విశాఖపట్నం నుంచి ఢిల్లీకి ప్రయాణిస్తున్న ఇండిగో విమానం శనివారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. విమానం గాలిలో ఉండగా ఒక ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో రన్‌వే 28 వద్ద అధికారులు పూర్తిస్థాయి ఎమర్జెన్సీ ప్రకటించారు. విమానాశ్రయం వద్ద ముందు జాగ్రత్తగా అగ్నిమాపక యంత్రాలు, వైద్య బృందాలను సిద్ధంగా ఉంచారు. మొత్తం 160 మంది ప్రయాణికులతో ఉన్న ఈ విమానం ఉదయం 10:59 గంటలకు సురక్షితంగా ల్యాండ్ అవ్వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నారని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్ వర్గాలు తెలిపాయి.

## చలో హైదరాబాద్‌కు ఆశాల పిలుపు

**- ఎక్కడిక్కడే పోలీసుల అరెస్ట్**



**హైదరాబాద్,మార్చి28( తెలుగురేఖ):** చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్‌టీయూ నేతలు, ఆశావర్కర్లు ముందస్తుగా అనుమతులు తీసుకున్నారు. కానీ ర్యాలీకి పర్మిషన్ ఇచ్చినట్లే ఇచ్చి బీఆర్‌టీయూ ఆశావర్కర్లను అక్రమంగా అరెస్టు చేసారు.

బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్; కార్యదర్శి మారయ్యను అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు.

అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఆశావర్కర్లు ఎక్కడికక్కడ అరెస్టు చేసారు. పోలీసుల తీరుపై ఆశావర్కర్లు, బీఆర్‌టీయూ నేతలు మండిపడుతున్నారు. ధర్నాకు అనుమతులు ఇచ్చిన తర్వాత ఎందుకు అరెస్టు చేస్తున్నారని పోలీసులను నిలదీస్తున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు దక్కుతున్న గౌరవమిదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి తీరుతామని స్పష్టం చేశారు.

Printed and Published by RAMANI WEB OFFSET PRINTERS, Published at 8-81/11/1, AUTONAGAR,village:BOMMAKAL, mandal& District:KARIMNAGAR-505001, RNI No. TEL-TEL/2010/31853, Editor: Eldi Ravinder, 9-10/7, KRISHN NAGAR,village:BOMMAKAL, mandal& District:KARIMNAGAR-505001telugurekha1984@gmail.com, 9963197573.